

రామతీర్థంలో బ్రహ్మోత్సవాలు

నెల్లిమర్ల, అక్టోబరు 4: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అర్చకులు శుక్రవారం ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికంగా ధ్వజారోహన తంతు నిర్వహించారు. ఏటా రామతీర్థంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రుల్లో ఆశ్వయుజ శుద్ధ విదియ మొదలుకొని దశమి వరకు తొమ్మిది రోజులు వేంకటేశ్వరస్వామి వారికి ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం యాగశాలలో స్వామిని వేంచేపు చేసి విశ్వక్సేన ఆరాధన, స్వస్తి, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమం తదితర పూజా క్రతువులు నిర్వహించారు.



పంచుకుందాం!

- మద్యం షాపులు చేజిక్కించుకునే ఎత్తుగడ
- సిండికేటవుతున్న వైసీపీ, కూటమి నేతలు
- పరిమిత దరఖాస్తులకు ప్రయత్నం
- చక్రం తిప్పుతున్న ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి

లిక్కర్ వ్యాపారం అంటే కొందరికి చాలా మక్కువ. తక్కువ సమయంలో ఎక్కువ రాబడి ఇచ్చే వ్యాపారంగా భావిస్తారు. అందుకే ప్రభుత్వం వేల నిర్వహించనున్న షాపులను కైవసం చేసుకునేందుకు ఉవ్విళ్లూరు తున్నారు. ఈ తంతులో ఆ పార్టీ ఈ పార్టీ అని కాకుండా అందరూ ఒక్కటవుతున్నారు. సిండికేటై సర్దుకుందామన్న అభిప్రాయానికి వచ్చేశారు. పరిమితంగా దరఖాస్తులు ఇచ్చేలా తెరవెనుక ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఈ వ్యవహారంలో ఉత్తరాంధ్రకు చెందిన ఓ మాజీ మంత్రి చక్రం తిప్పుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ రాజాం రూరల్

లిక్కర్ వ్యాపారానికి గతంలో విజయనగరం పేరొందింది. దీంట్లో బాగా రాణించి రాజకీయాల్లోకి వచ్చిన జిల్లా నేతలు ఆ తర్వాత కూడా ఏ స్థాయికి ఎదిగారో బహిరంగ రహస్యమే. జిల్లాలో మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారిలో ఓ కుటుంబానికి పెద్దపేరు ఉంది. ఉత్తరాంధ్ర రాజకీయాలను చూపుడు వేలుతో శాసించే అదే కుటుంబానికి చెందిన మాజీ మంత్రి కనుసన్నల్లోనే నూతన మద్యం వ్యాపారులు సిండికేట్ అవుతున్నారని ప్రచారం జరుగుతోంది. వైసీపీని వీడి మరో పార్టీలో చేరాలనుకుంటున్న ఓ మాజీ ప్రజాప్రతినిధి సోదరుడు కూడా జిల్లాలో చక్రం తిప్పుతున్నారు. ఇప్పుడు మద్యం టెండర్ల కోసం పాకులాడుతున్న సిండికేట్ వ్యాపారులంతా గతంలో ఆ తాను ముక్కలే కావడంతో ఇతరులకు టెండర్లలో చోటు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో కొన్నిచోట్ల టీడీపీ ఉమ్మెల్యేలతో వారు అంటకాగుతూ మనం మనం బరంపురం అంటూ సయోధ్య కుదుర్చుకుంటున్నారు.

జిల్లా కేంద్రంతో పాటు అనేక చోట్ల వైసీపీ, కూటమి నేతలు కుమ్మక్కై మద్యం సిండికేట్‌గా తయారవుతున్నారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న వారు ఉండడంతో.. వారికి ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ పనిని ఇట్టే కానిచ్చేస్తున్నారు. ప్రైవేటు మద్యం షాపుల కేటాయింపును పారదర్శకంగా లాటరీ ప్రక్రియలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బ్యాచ్ మాత్రం భారీగా షాపులు కొల్లగొట్టేందుకు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. మిగతా వారిని దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవచ్చునని అనుకుంటున్నారు. ఐదేళ్లగా రాజకీయాల్లో సంపాదించిన సొమ్మును పెట్టుబడిగా పెట్టేందుకు సిద్ధమైనట్టు సమాచారం. అందుకే ముందు నుంచి మద్యం వ్యాపారంతో టచ్‌లో ఉన్న వారితో పాటు రాజకీయ స్నేహితులను వాడుకునేందుకు సిద్ధపడుతున్నారు. జిల్లాలో కూటమి నాయకులకు మద్యం వ్యాపారంతో సంబంధాలు అంతంతమాత్రమే. అయితే ఇతర ప్రధాన పార్టీల నేతల బ్యాక్ గ్రౌండ్ మాత్రం మద్యం వ్యాపారమే. అందుకే వీలైనన్ని ఎక్కువ షాపులు దక్కించుకు నేందుకు వారు పావులు కదుపుతున్నారు. ఇందుకుగాను తమ 'రాజకీయ' స్నేహాన్ని వాడుకుంటున్నట్టు తెలుస్తోంది.

- గతానికి భిన్నంగా దరఖాస్తు సమయంలోనే వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. దరఖాస్తు చేసిన వారిలో ఎవరిపేరున షాపు దక్కినా అందరూ భాగస్వాములేనన్న ప్రధాన సూత్రంతో ఈ ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈనెల 11న లాటరీ ద్వారా షాపుల ఎంపిక ప్రక్రియ ఖరారు కానున్న నేపథ్యంలో 12న దసరా పర్వదినాన షాపులు ప్రారంభించేందుకు వీలుగా కొంతమంది షాపుల్ని సైతం ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది.

పెరుగుతున్న దరఖాస్తులు..

ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే అమావాస్య సెంటిమెంట్ కావడంతో మంగళ, బుధవారాల్లో దరఖాస్తులు అంతంతమాత్రంగానే వచ్చాయి. ప్రభుత్వం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తుకు అవకాశం ఇచ్చింది. నేరుగా కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవడమే ఉత్తమమని ఎక్కువ మంది భావిస్తున్నారు. గురువారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ఊపందుకుంది. ఉమ్మడి జిల్లాలో 223 మద్యం షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో విజయనగరం జిల్లాకు 165 (149 ప్రయివేటు వ్యక్తులకు, 16 గీత కార్మికులకు), పార్వతీపురం మన్యం జిల్లాకు 58, (ప్రయివేటు వ్యక్తులకు 53, గీత కార్మికులకు 5) ఈలెక్కన జిల్లాలోని 27 మండలాలలో మద్యం అమ్మకాలకు డిమాండ్ ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసేందుకు రంగం సిద్ధం అవుతోంది. జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజును ప్రభుత్వం నిర్ధారించిన నేపథ్యంలో గతంలో అమ్మకాలను ప్రాతిపదికగా తీసుకుని ఆయా చోట్ల దరఖాస్తులు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

నాలుగు శ్లాబుల్లో..

జనాభా ప్రాతిపదికన లైసెన్స్‌దారుల నుంచి నాలుగు స్లాబుల్లో డిపాజిట్లను వసూలు చేసేలా నిర్ణయించారు. 10వేల జనాభాలోపు ఉన్న ప్రాంతంలో రూ.5 లక్షలు, 50 వేల జనాభా ఉంటే రూ.50 లక్షలు, 50వేలు-లక్ష మధ్య జనాభా ఉండే పట్టణాలలో రూ.65 లక్షలు, లక్ష దాటి జనాభా ఉండే పట్టణాలలో రూ.85 లక్షలు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు లైసెన్స్ ఫీజు చెల్లించేందుకు సైతం వ్యాపారులు సిద్ధమై దరఖాస్తులు చేసేందుకు ఉత్సాహాన్ని చూపిస్తున్నారు.

మంచిరోజులొస్తున్నాయ్

- గిరిజనులకు త్వరలో తప్పనున్న డోలీ కష్టాలు
- చిట్టెంపాడు రోడ్డుకు రూ.11 కోట్లు



శృంగవరపుకోట అక్టోబరు 4:
శృంగవరపుకోట మండలం చిట్టెంపాడు గ్రామానికి డోలీ కష్టాలు తీరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ గ్రామానికి 10.40 కి.మీ రోడ్డు నిర్మించేందుకు రూ. 1130 లక్షలను పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ విడుదల చేశారు. ఈ గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో గత ఏడాదిలో ఒక బాలింత, ఇద్దరు చిన్న పిల్లలకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రస్తుత విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారిలు కాలినడకన కొండెక్కి ఆ గ్రామాన్ని సందర్శించారు. తెలుగుదేశం, జనసేన, బిజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్రామానికి రోడ్డేస్తామని హామీ ఇచ్చారు. కొండ శిఖరాన వున్న గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణానికి గురువారం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నిధుల జాబితాలో ఈ గ్రామంతో పాటు వేపాడ మండలం పి.కె.ఆర్ పురం శివారు గదబవలస గిరిజన గ్రామ రోడ్డు 2.90 కి.మీకు రూ. 265లక్షలు మంజూరు అయ్యాయి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు రావడంతో కూటమి ప్రజా ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఈ గిరి శిఖర గ్రామ రోడ్డు నిర్మాణానికి నిధులిచ్చినట్లే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిశిఖర గ్రామాల్లో 50.37కి.మీలలో రోడ్లు నిర్మాణానికి రూ. 5,203.47 లక్షలు ఇవ్వనుంది. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి జీవో ఆర్‌టీ నెంబర్ 549 విడుదలైంది.

వీవీఐపీలకు స్లాట్

- తొలేళ్లు, సిరిమానోత్సవం రోజున వారికి ప్రత్యేక సమయం

(విజయనగరం రూరల్)
పైడిమాంబ సిరిమానోత్సవానికి విచ్చేసే వీవీఐపీలకు ప్రత్యేక స్లాట్ కేటాయించనున్నారు.. వీవీఐపీల దర్శనం సందర్భంగా సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదన్న మాన్సాస్ చైర్మన్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అశోక్ గజపతిరాజు సూచనతో జిల్లా అధికార యంత్రాంగం వీవీఐపీలకు టైం స్లాట్‌ను కేటాయించనుంది. గతంలో ఈ విధానం పెద్ద, పెద్ద ఆలయాలకు మాత్రమే ఉంది.. పైడిమాంబ సిరిమానోత్సవం జరిగే రోజు, ముందు రోజు తొలేళ్ల సమయంలో వీవీఐపీలు ఎక్కువ మంది పైడిమాంబను దర్శించుకునే అవకాశం ఉంది. ఆ సమయంలో సాధారణ భక్తులు ఇబ్బందులు పడొచ్చు. ఈ నేపథ్యంలో వీవీఐపీలకు స్లాట్ కేటాయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ, అదే విధంగా 14న తొలేళ్ల రోజున కూడా ఉదయం 10 నుంచి 12 వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకూ, మంగళవారం సిరిమానోత్సవం రోజున ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ ఈ స్లాట్ దర్శనం కల్పించనున్నారు. ఈ సమయంలో సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.



పైడిమాంబను దర్శించుకున్న అశోక్

పైడిమాంబను చదురుగుడిలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, మాన్సాస్ చైర్మన్ అశోక్ గజపతిరాజు ఆయన సతీమణితో కలిసి శుక్రవారం ఉదయం పైడిమాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ప్రత్యేకాధికారిగా త్రినాథరావు

సిరిమానోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏటా సిరిమానోత్సవానికి దేవస్థానం తరుపున ప్రత్యేకాధికారిని నియమించడం ఆనవాయితీగా వస్తోంది.. ఈ ఏడాది కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించింది. ఉత్సవ ప్రత్యేక అధికారిగా సింహాచలం దేవస్థానం ఈవో, దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావును నియమించారు. ఈయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగరంలోని కోట జంక్షన్, అదే విధంగా మూడులాంతర్ల జంక్షన్ తదితర సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలించారు.

ఇవేం ఎండలు?

విజయనగరంలో స్కార్ఫ్ ధరించి నడుస్తున్న మహిళ



ఇది ఎండాకాలమా అని భ్రమించేలా ఎండలు మండిపోతున్నాయి. గ్రీష్మతాపాన్ని గుర్తుచేస్తున్నాయి. ఇంచుమించుగా జిల్లా అంతా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. గత నాలుగురోజుల్లో ఒక్కరోజు కొద్దిపాటి వర్షం మినహా ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఊహించని విధంగా విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. ఎండ, ఆపైన ఉక్కబోతను భరించలేక చాలా మంది ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో రాత్రి తొమ్మిది గంటలు దాటితే విద్యుత్ వినియోగం అపరిమితంగా పెరుగుతోంది. నైరుతి నిష్క్రమణతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవాలి కాని నైరుతి నిష్క్రమించి వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకూ మార్పులేదు. తాజాగా శుక్రవారం విజయనగరంలో 37 డిగ్రీలు నమోదు కాగా ఉక్కబోత, ఎండ వేడికి ప్రజలు అవస్థలు పడడం కనిపించింది. ముఖ్యమైన కూడళ్ల వెలవెలబోయాయి.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)

డీపీవోగా వెంకటేశ్వరరావు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 4: జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో జడ్పీ సీఈఓగా ఇక్కడ పనిచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని.. సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామీణులకు చేరేలా ప్రయత్నిస్తానని చెప్పారు. జిల్లాపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కలెక్టర్ అంబేడ్కర్‌ను డీపీవో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు డీపీవోగా పనిచేసిన శ్రీధర్‌రాజా శ్రీకాకుళం డీపీవోగా బదిలీపై వెళ్లారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీవో

ట్రయల్ రన్ సక్సెస్

సాలూరు-విశాఖ వయా బొబ్బిలి ప్యాసింజరు రైలు రాక



బొబ్బిలి, అక్టోబరు 4: మన్యం జిల్లా సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా విశాఖపట్నానికి ప్రవేశపెట్టనున్న ప్యాసింజరు రైలుకు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. విశాఖలో ఉదయం 10 గంటలకు బయలుదేరిన రైలు బొబ్బిలి మధ్యాహ్నం 12.30కి, సాలూరుకు 1.10 గంటలకు చేరుకుంది. సాలూరు నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు తిరిగి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు విశాఖ చేరుకుంది. నిర్ణీత సమయానికే ఈ రైలు గమ్యం చేరింది. బొబ్బిలి నుంచి సాలూరు రైలు మార్గంలో ట్రాక్, సిగ్నల్ సిస్టమ్, విద్యుత్ వ్యవస్థ పనితీరును రైల్వే అధికారులు పరిశీలించారు. బొబ్బిలి నుంచి సాలూరు వెళ్లే మార్గంలో గిరిజన గ్రామాలు, ఇతర కుగ్రామాలు ఉండగా వారంతా తమ ప్రాంతానికి పెద్ద రైలు వచ్చేసరికి ఆసక్తిగా తిలకించారు. ఈ రైలులో అధికారులు, సిబ్బంది మాత్రమే ప్రయాణించారు.



పండగ ప్రయాణం

విద్యార్థులంతా పండగకు బయలుదేరారు. దసరా సంబరాలకు స్వగ్రామాలకు వెళ్లేందుకు ఇంటిబాట పట్టారు. సెలవులు ఇచ్చి రెండు రోజులైనప్పటికీ అసలు పండగకు సమయం ఉండడంతో గురు, శుక్రవారాల్లో ఎక్కువ మంది పయనమయ్యారు. ఇంటికి వెళ్తున్న ఆనందంలో బస్సులు కిక్కిరిసినా సర్దుకుపోతున్నారు. అయితే ఏ వాహనం చూసినా కిటకిటలాడుతూ కనిపిస్తోంది. కాంప్లెక్స్‌లో స్టాప్ వద్ద నిలిపిన నిమిషాల్లోనే బస్సు ఫుల్ అయిపోతోంది. కొన్ని బస్సుల్లో నిల్చొనేందుకు కూడా స్థలం ఉండడం లేదు. ఇక విజయనగరంలో పైడిమాంబ సిరిమానోత్సవం, అంతకముందు విజయనగరం ఉత్సవాలు జరుగనుండడంతో దాదాపు పదిరోజులు అందరికీ పండగే పండగ.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)



వినతులు స్వీకరించండి

● ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 7న జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అన్నిరకాల వినతులను స్వీకరించాలని శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సామాజిక పింఛన్ల మంజూరుకు వినతిపత్రాలు తీసుకోవాలన్నారు. వీటిని పార్టీ కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ కుమారి, ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ ఐవీ లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్‌నాయుడు పాల్గొన్నారు.

ఎస్.కోటలో స్కూల్ గేమ్స్ ఎంపికలు

శృంగవరపుకోట: శృంగవరపుకోట పీఆర్ షటిల్ కోర్టులో శుక్రవారం స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ 14, 17 బాలబాలికల ఎంపికలు జరిగాయి. ధర్మవరం వ్యాయామ ఆధ్యాపకుడు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలిపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో తలపడనున్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

వేపాడ: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పార్టీ మండల అధ్యక్షుడు గోకాడ మహేష్ సారథ్యంలో వల్లంపూడి, సోంపురం తదితర గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి దానేష్, జిల్లా మైనార్టీ మోర్చ అధ్యక్షులు షేక్ నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వల్లంపూడిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న దృశ్యం

మద్యం షాపుల్లో రిజర్వేషన్ కల్పించాలి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీలో ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించాలని జిల్లా అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సామాజిక న్యాయం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే దళితులకు కూడా రాయితీ డిపాజిట్ విధానంపై మద్యం షాపులను కేటాయించాలని ఆయన కోరారు.

ఒకే విద్యా విధానం ప్రవేశపెట్టాలి



ప్రసంగిస్తున్న ఏపీటీఎఫ్ నాయకుడు జేసీ రాజు

బొబ్బిలి రూరల్: దేశంలో ఒకే విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. శుక్రవారం స్థానికంగా జోనల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ రాజు మాట్లాడుతూ దేశానికి అంతటా వర్తించే కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడే ప్రతి విద్యార్థికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, జిల్లా కార్యదర్శి పీటర్, ఎల్లయ్య, లక్ష్మణరావు, శ్రీను, రామకృష్ణ, సింహాచలం, పరశునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యతపై ప్రవచనం

బొబ్బిలి రూరల్: కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం పూడి రామ మందిరం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బోధనపల్లి గౌరి నృసింహ ప్రసాద్ శర్మ బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యతపై ప్రవచించారు. అనంతరం మహిళలతో కుంకుమ పూజలు చేయించారు.

ప్రతి గ్రామానికీ రహదారి నిర్మిస్తాం

వీరఘట్టం: మండలంలోని సీపీఎస్ రహదారి నుంచి చిట్టిపూడివలస వరకు రూ.120 కోట్ల ఉపాధి నిధులతో నిర్మించిన బీటీ రోడ్డు, సీసీ రోడ్డును, యు.వెంకమ్మపేట వరకు రూ.50లక్షలతో నిర్మించిన రహదారిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం చిట్టిపుడివలసలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రహదారులు నిర్మిస్తామన్నారు. అనంతరం రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింతా ఉమా, అనీల్‌బాబు, జాన్, లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పాలకొండ: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.రాంబాబు అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. కళాశాల న్యాక్‌బీ గ్రేడ్ పొందడంలో అధ్యాపకులు, విద్యార్థులకు అభినందించారు. అనంతరం ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్య నిపుణులు రౌతు భారతి, సీపీడీసీ సెక్రటరీ కె.చౌదరినాయుడు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుంకరి సుధాకర్, కోశాధికారి కంబాల రవిరాజ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

పార్వతీపురంటౌన్: కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎన్ఎంయూ విజయనగరం ఉమ్మడి జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, రాఫిల్‌లు పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గాదేవిని కోరారు. శుక్రవారం పార్వతీపురం డిపో ఎన్ఎంయూ నూతన అధ్యక్ష, కార్యదర్శులు టి.రాములు, కేటీ రాజులతో పాటు కార్యవర్గ సభ్యులను డీఎంకు పరిచయం చేశారు. ఈసందర్భంగా వారు డీఎంకు ఉమ్మడి జిల్లాలో కార్మికుల సమస్యలను తెలియజేశారు. సంస్థలో పనిచేస్తున్న కండక్టర్, డ్రైవర్లకు సంబంధించి పనిఒత్తిడిని తగ్గించాలన్నారు. బాధ్యతగా పనిచేస్తున్న ఉద్యోగులకు శిక్షలు వద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, మధు, నూతన కార్యవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నాగభూషణరావు, కోశాధికారి జీపీరాజు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

పార్వతీపురం/టౌన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం పార్వతీపురం డిపో నుంచి గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి నూతన బస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఆర్టీసీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పని చేస్తోందన్నారు. అనంతరం ఆర్టీసీ డిపోలోని తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, తదితర సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని డిపో మేనేజర్ దుర్గాదేవిని కోరారు.

నడవండి.. ఆరోగ్యంగా జీవించండి

పార్వతీపురంటౌన్/బెలగాం: అన్ని వయస్సుల వారు నడవడం ద్వారా ఆరోగ్యంగా జీవించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ క్లబ్ సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడా మైదాన అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే అన్ని వయస్సుల వారికి స్వల్పంగా వ్యాయామం చేసుకోవడానికి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం

సీతానగరం: నియోజకవర్గంలోని ప్రతి పల్లెను, ప్రతి వార్డును దశలవారీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. పెదంకలాం గ్రామంలో రూ.67లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా సీతానగరానికి చెందిన విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 6న పార్వతీపురంలో బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా సీతానగరంలోని ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు అభినందించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

● రెండో రోజు గాయత్రీమాతగా దర్శనమిచ్చిన అమ్మవారు

దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాలతో పాటు మండపాల్లో శుక్రవారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారు రెండో రోజు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. (ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి: గాయత్రీదేవి అవతారంలో గొల్లపల్లి దాడితల్లి



కొత్తవలస: దుర్గాదేవికి పూజలు చేస్తున్న లలితకుమారి



విజయనగరం క్రైం: దేవీ దండుమారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు



రాజాం రూరల్: నవదుర్గకు పూజలు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయంలో..



గజపతినగరం: గంగచోళ్లపెంటలో..



బొబ్బిలి రూరల్: అలజంగిలో కుంకుమార్చన

అధికారులు బాధ్యతల స్వీకరణ

గజపతినగరం: జిల్లాలో నూతనంగా బదిలీ అయిన పలువురు ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఇతర అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గజపతినగరం ఎంపీడీవోగా బి.కల్యాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన కె.కిషోర్‌కుమార్ భోగాపురం మండలానికి బదిలీపై వెళ్లగా గుర్ల మండలం నుంచి బదిలీపై కల్యాణి ఇక్కడకు వచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో జేఈగా బాధ్యతలు చేపట్టిన నానిబాబు గంట్యాడ మండలానికి బదిలీ కాగా, తెర్లాం మండలం నుంచి జేఈగా ఎం.శ్రీనివాసరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా ఎం.తిరుపతిరావు బాధ్యతలు చేపట్టారు. ● **మెంటాడ:** ఎంపీడీవోగా కూర్మనాథ్ పట్నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వేపాడ మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. అనంతరం ఎంపీపీ సన్యాసినాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ● **దత్తిరాజేరు:** దత్తిరాజేరు ఎంపీడీవోగా వైవీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవో పనిచేసిన ఎంవీ సుబ్రహ్మణ్యం గరివిడికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఈయన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా నవీన్, తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీగా కె.సత్యనారాయణ, ఆర్ఐగా నారాయణరావు బాధ్యతలు చేపట్టారు. ● **బొండపల్లి:** బొండపల్లి ఎంపీడీవోగా జి.గిరిబాల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె నెలిమర్ల మండలం ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈమెకు ఎంపీపీ చల్లా చలంనాయుడు పుష్పగుచ్ఛం అందించారు. ఇక్కడ పనిచేసి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు దత్తిరాజేరు మండలం బదిలీ అయింది. అలాగే పంచాయతీరాజ్ జేఈగా పి.అప్పలనాయుడు, గజపతినగరం మండలం నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. దత్తిరాజేరు నుంచి జూనియర్ సహాయకులు సంతోష్‌కుమార్ విధుల్లో చేరారు. డీటీగా వి.రాజేశ్వరరావు ఎల్.కోట మండలం నుంచి వచ్చి విధుల్లో చేరారు. ఇక్కడ డీటీగా పనిచేసి పి.హరికి కొత్తవలస మండలం బదిలీ అయింది. ● **రేగిడి:** రేగిడి మండల డిప్యూటీ తహసీల్దారుగా ఎన్.చిన్నారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా పనిచేసిన సత్యనారాయణ తెర్లాం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బొబ్బిలి తహసీల్దారు కార్యాలయ డీటీగా పనిచేసిన చిన్నారావు ఇక్కడికు బదిలీపై వచ్చారు. అలాగే ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా మురళి విధుల్లో చేరారు. ● **వంగర:** మండలంలోని 19 గ్రామ సచివాలయాల కార్యదర్శులకు బదిలీ అయినట్లు ఎంపీడీవో త్రినాథ్ తెలిపారు. ఇందులో గ్రేడ్ 4 పంచాయితీ కార్యదర్శులు 8 మంది, గ్రేడ్ 5 ఒకరు, రాజులగుమ్మడ, శివ్వాం, శ్రీహరిపురం డిజిటల్ అసిస్టెంట్లు ముగ్గురు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారని తెలిపారు. ● సంగాం దేవాలయ ఈవోగా శ్యామలరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఈవో కేశవరావుపై రాజాం, సంగాం దేవాలయాల్లో ఆరోపణల నేపథ్యంలో సస్పెండయ్యారు. ఆ స్థానంలో శ్యామలరావును నియమించారు. ● **రామభద్రపురం:** స్థానిక ఎంపీడీవోగా ఎం.రత్నం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రమామణిని జియ్యమ్మవలస బదిలీ చేశారు. ఆమె స్థానంలో మెరకముడిదాం ఎంపీడీవోను ఇక్కడ నియమించారు. ● వెలుగు ఏపీఎంగా అన్నపూర్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం రత్నప్రసాద్‌ను బాడంగి బదిలీ చేశారు. ● **బాడంగి:** వెలుగు ఏపీవోగా ఎ.రత్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామభద్రపురం నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన భాగ్యలక్ష్మి బొబ్బిలి బదిలీపై వెళ్లారు. సీఎస్‌డీటీ ఆర్.ధనం విధుల్లో చేరారు. ఎంపీడీవో ఆఫీసు ఏవో డీవీఎస్ లత బాధ్యతలు చేపట్టారు. ● **లక్కవరపుకోట:** ఎంపీడీవోగా ఎస్.అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కురుపాం మండల నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కే.రూపేష్ పార్వతీపురం బదిలీ అయ్యారు. ● **జామి:** జామి ఎంపీడీవోగా నీలం అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సతీష్ ఎస్.కోట ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. ● **వేపాడ:** వేపాడ ఎంపీడీవోగా సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మక్కువ మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన పట్నాయక్ మెంటాడ మండలానికి బదిలీపై వెళ్లారు. ● వెలుగు ఏపీఎంగా డి.సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఆయన లక్కవరపుకోట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏపీఎంగా పని చేసిన వెంకటరమణ బదిలీపై వెళ్లారు. ● **గరివిడి:** మండల ఈవోపీఆర్డీవోగా పుష్పాంజలి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె సంతకవిటి మండలం నుంచి గరివిడికి బదిలీపై వచ్చారు. గతంలో గరివిడి మండలంలో పనిచేసినట్టు చెప్పారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

చీపురుపల్లి: మాదకద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ ఎల్.దామోదరరావు కోరారు. ఈ మేరకు పీకే పాలవలస గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, తయారీ, రవాణా నేరమన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నెల్లిమర్ల: మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. అల్తిపాలెం గ్రామంలో శుక్రవారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా చేసినా, అమ్మకం, కొనుగోళ్లు చేసినా వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్

ఏపీటీఎఫ్ సభలను విజయవంతం చేయాలి

నెల్లిమర్ల: విజయనగరం ఫూల్‌బాగ్ రోడ్డులోని జె.కన్వెన్షన్ హాలులో ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న ఏపీటీఎఫ్(1938) 80 వసంతాల వేడుకలు, 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి కోరారు. ఈ మేరకు నెల్లిమర్లలో శుక్రవారం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఈఏ ఉపాధ్యక్షుడు వై.సత్యం, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సురక్షిత నీటితో ఆరోగ్యం

నెల్లిమర్ల: ప్రతిఒక్కరూ సురక్షిత, శుద్ధ జలాన్ని తాగి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. కొండపేటలో రిటైర్డు సైనికుడు గనగల నాగరాజు ఏర్పాటుచేసిన శుద్ధజల వాటర్ ప్లాంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జనసేన నాయకుడు చనమల్లు వెంకటరమణ, టీడీపీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రవిశేఖర్

నిత్యావసర వస్తువుల పంపిణీ

విజయనగరం దాసన్నపేట: నగరంలోని అలకానంద కాలనీలో ఎస్.కోటకు చెందిన చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో 30 మంది పేదలకు శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీఆర్‌ఓ జానకమ్మ, విశ్రాంత అసిస్టెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ వీవీ రాజారావు, సభ్యులు వెంకటరావు, ప్రసాద్, శ్రీను, నర్సింగరావు, రమణ, నారాయణరాజు, చౌదరి హాజరయ్యారు.

ఫోర్టుసిటీ విద్యార్థినికి గుర్తింపు

విజయనగరం దాసన్నపేట: వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో ఫోర్టుసిటీ పాఠశాల విద్యార్థి పాశల ఆద్యా ప్రశస్త పేరు నమోదు చేసుకుంది. మూడేళ్ల ఏనిమిది నెలల వయస్సు కలిగిన ప్రశస్త 450 ఫ్లాష్‌కార్డుల్లో ఉన్న పదాలను, చిన్న వాక్యాలు, రైమ్స్‌ను 20 నిమిషాల్లో చదివి రికార్డు సృష్టించింది. ఆ చిన్నారిని పాఠశాల చైర్మన్ కేపీపీ రాజు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోహినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ అభినంఇంచారు.



ఆద్యాను అభినందిస్తున్న కేపీపీ రాజు

శాప్ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: రాష్ట్ర క్రీడాప్రాధికారిత సంస్థ (శాప్) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎ.రవినాయుడును శుక్రవారం జిల్లా టీడీపీ తెలుగు యువత నాయకులు పొగిరి పైడిరాజు, గొలగాని సురేంద్ర, కుటుంబరావు, మద్దిల ప్రవీణ్, పీలా శేఖర్‌లు విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు.



శాప్ చైర్మన్ రవికుమార్‌తో టీడీపీ నాయకులు

రైతుభరోసా కేంద్రాలు పటిష్ఠం చేయాలి

రేగిడి: జిల్లాలో అన్ని రైతుభరోసా కేంద్రాలను పటిష్ఠం చేయాలని, అవసరమైన సేవలతో పాటు, సిబ్బందిని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు శుక్రవారం సంకిలిలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉన్న 25 భరోసా కేంద్రాల్లో సగం మంది సిబ్బంది లేరని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని అయన కోరారు.

ముడి ఇనుము సరఫరాకు లైన్

గంట్యాడ: చతీష్‌గడ్ నుంచి విశాఖపట్టణం వరకు ముడి ఇనుము సరఫరాకు ఏర్పాటుచేస్తున్న లైన్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వెళ్లనున్నది. సుమారు రెండు మీటర్ల వెడల్పుతో ఈ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని పెదవేమలి, మురపాక, సిరిపురం, రావివలస, కొటారుబిల్లి, నీలావతి, జగ్గాపురం గ్రామాల నుంచి ఈ లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించి సర్వే నెంబర్లను గుర్తించారు. ఈ భూముల్లో రైతులు ఎవరు ఉంటున్నారు.. అనేదానిపై రెవెన్యూ కార్యదర్శులు వివరాలు సేకరిస్తున్నారు. దీని ఏర్పాటు కోసం సుమారు 60 ఎకరాల భూమి అవసరం అవుతుందని సంబంధిత అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

ఒమ్మిలో 'పొలం పిలుస్తోంది'

నెల్లిమర్ల: ఒమ్మి గ్రామంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎం.పూర్ణిమ పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు, మాజీ సర్పంచ్ అంబళ్ల అప్పలనాయుడు, పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సలహాదారు లక్ష్మి పాల్గొన్నారు.

గొయ్యిపాకలో ప్రజాదర్బార్

గుమ్మలక్ష్మీపురం: గొయ్యిపాక పంచాయతీ కేంద్రంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంగన్‌వాడీ, పాఠశాల భవనాల నిర్మాణం, రహదారులు, తాగునీరు తదితర సమస్యలను గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ పాడి సుదర్శనరావు, పార్టీ నాయకుడు రామారావు పాల్గొన్నారు.

కాటేజీల ఏర్పాటుకు స్థల పరిశీలన

సీతంపేట రూరల్: పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఏకో టూరిజం కింద సీతంపేటలోని తురాయిపువలస హెచ్ఎన్‌టీసీ ఫారంలో కాటేజీల ఏర్పాటుకు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. శుక్రవారం ఉద్యానవన కేంద్రంలో ఏకో పార్క్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించారు. పర్యాటకులకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటే ప్రదేశంలో కాటేజీల నిర్మాణం చేపడతామని అయన తెలిపారు.

పోటీ పరీక్షల మెటీరియల్ ఉంచండి

పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను యువతకు అందుబాటులో ఉంచాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. సీతంపేట గ్రంథాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రంథాలయానికి రహదారి సౌకర్యం లేదని పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని నిర్వాహకుడు బి.గణేష్ ఆయనకు వివరించారు. దీనిపై పీవో స్పందిస్తూ ఈ గ్రంథాలయాన్ని ఎంఎంఎస్ పాత భవనంలోకి మార్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ పరిశీలనలో పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డితో పాటు ఏపీవో జి.చిన్నబాబు, పీహెచ్‌వో వెంకటగణేష్, సిబ్బంది ఉన్నారు.

జలజీవన్ పనుల పరిశీలన

భామిని: మండలంలో జలజీవన్ ద్వారా చేపడుతున్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వి.మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పనులు చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. బత్తిలి పైపులైన్లు, నేరడిలో ట్యాంకు పనులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్‌మిషన్ పథకం కింద ప్రతి గ్రామానికి తాగునీరు అందించే లక్ష్యంతో చేపడుతున్నామన్నారు. 61 కోట్లు మంజూరు కాగా పసుకుడి కొండపైన ట్యాంకు ఏర్పాటు చేసి వంశధార నది నుంచి నీటిని మళ్లించి గ్రావిటీ ద్వారా ప్రతి గ్రామానికి వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని చెప్పారు. పసుకుడి, తాలాడ, చిన్నదిమిలి, కొరమ తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ శేఖరానికి సూచించారు. ఆయనతో పాటు జేఈ సందీప్ ఉన్నారు.

నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

కలెక్టరేట్: ప్రధాన మంత్రి కిసాన్ 18వ విడత నిధులు శనివారం కేంద్ర ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకూ సంబంధించిన నిధులు విడుదల కానున్నాయి. జిల్లాలో 1.85 లక్షల మంది రైతులకు రూ.37.08 కోట్ల నిధులు జమ కానున్నాయని వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రెండో రోజు పరీక్షకు 74 మంది దూరం

కలెక్టరేట్: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు శుక్రవారం 74 మంది అభ్యర్థులు దూరంగా ఉన్నారు. ఉదయం ఒక కేంద్రంలో .పేపర్ 2 లాంగ్వేజ్ తెలుగు పరీక్షకు సంబంధించి 40 మంది అభ్యర్థులకు గాను 35 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్ 2 లాంగ్వేజ్ ఇంగ్లీష్ సబ్జెక్టును 740 మంది రాయల్సి ఉండగా 671 మంది రాశారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు సుబ్బారెడ్డి, డీఈవో ప్రేమ్ కుమార్ పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

బొబ్బిలి రూరల్: ఈ నెల 6, 7, 8 తేదీలలో తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీలకు అండర్ 14 విభాగంలో బొబ్బిలి క్రీడాకారులు బి.వరలక్ష్మి, అండర్ 17 విభాగంలో డి.ఆదిత్య, సోమేశ్ యాదవ్, శివరామకృష్ణ పాల్గొంటున్నట్లు తైక్వాండో సీనియర్ కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ క్రీడాకారులను ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు.

ఆ పాఠశాలలను మళ్లీ ప్రారంభించాలి: ఎంపీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వ విలీనం చేసిన ప్రాథమిక పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు కోరారు. శుక్రవారం రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజవర్గాల్లో ఉన్న సమస్యలపై చర్చించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చెయ్యాలని కోరారు.

పూడివానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

లక్కవరపుకోట: పూడివానిపాలెంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు హెల్త్ అసిస్టెంట్ రాజు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సచివాలయ ఏఎన్ఎం కె.పద్మ, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి మంచంపై ఉన్న రోగులను పరీక్షించి.. మందులు అందించారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

లక్కవరపుకోట: తిరుపతి లడ్డూ వివాదంలో సుప్రీం కోర్టు సీబీఐ పర్యవేక్షణలో సిట్‌ను ఏర్పాటు చేయమనడం స్వాగతించాల్సిన విషయమని టీడీపీ సీనియర్ నాయకులు, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ స్థానంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ అండర్లో ఇద్దరు, హిందూ ధర్మం, తిరుమల పవిత్రతో ఆటలాడుకున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. వైసీపీ నేతలు ఆడుతున్న రంగుల నాటకం ఇప్పుడు బయట పడుతుందన్నారు.

ప్రభుత్వ వైద్య సదుపాయాన్ని ఉపయోగించుకోండి



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

రాజాం: ప్రతి ఒక్కరు ప్రభుత్వ వైద్య సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆదర్శనగర్ వైద్యాధికారి కిరణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం తిమ్మయ్యపేట గిరిజన గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు గల కారణాలు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మయ్యపేట దత్తత స్వీకర్త సప్పటి వసంతరావు, ల్యాబ్ టెక్నీషియన్ సింహాచలం, రాంబాబు, ఉమ, ఇందిర, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

తెర్లాం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ శ్రీనువాసరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్.ఐ. సాగర్‌బాబును ఆదేశించారు. ఆయన వెంట సీఐ నారాయణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు విషం పెట్టి.. తాను తాగి!

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం లంకాజోడు గ్రామంలో దారుణం చేటుచేసుకుంది. కుటుంబ కలహాలతో బిడ్డిక రమ్య అనే మహిళ శుక్రవారం తన ఆరు నెలల చిన్నారికి, ఐదేళ్ల కుమారుడికి విషం పట్టించి, తాను కూడా తాగింది. ఒంటి నిండా రక్తం ఉండడాన్ని స్థానికులు గుర్తించి భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిన్నారుల తండ్రి రమేష్ పార్వతీపురంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా అవసరాలకు తగినంత ఇసుక సిద్ధం

- త్వరలో రెండు ఇసుక రీచ్‌లు ప్రారంభం
- చీపురుపల్లిలో స్టాక్ పాయింట్ ఏర్పాటు
- కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: జిల్లాలో నిర్మాణాలు కొనసాగేందుకు వీలుగా తగినంత ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. ఇది ఆరు నెలల వరకూ జిల్లా అవసరాలకు సరిపోతుందని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీతో సమావేశం శుక్రవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రవాణాకు రిజిస్టర్ చేసుకున్న స్థానిక వాహనాలకు మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. బుక్ చేసుకున్న ఇసుకకు సరిపడేంత వాహనాన్ని మాత్రమే తీసుకుని రావాలని... ఈ మేరకు యాప్‌లో మార్పులు చేయాలని సూచించారు. జిల్లాలో ఆరు నెలల అవసరాలకు సరిపడేంత ఇసుక అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద లభ్యమయ్యే 75 వేల టన్నుల ఇసుకలో 45 వేల టన్నులను బొబ్బిలి స్టాక్ పాయింట్‌కు తరలించాలని ఆదేశించారు. మిగిలిన 30 వేల టన్నుల ఇసుకను కొత్తగా ఏర్పాటు చేయనున్న చీపురుపల్లి స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉంచాలని చెప్పారు. తెర్లాం మండలం కుసుమూరు వద్ద సుమారు 17 వేల టన్నులు, సంతకవిటి మండలం తమరాడ వద్ద 47 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఈ రెండు ఇసుక రీచ్‌ల నుంచి తవ్వకాన్ని మొదలు పెట్టాలని ఆదేశించారు. రేగిడి ఆమదాలవలస మండలం పొర్లి వద్ద అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌పై సర్వే చేసి ఇసుక తవ్వకానికి సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్, ఏఎస్పీ సౌమ్యలత, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీటీసీ మణికుమార్, గ్రౌండ్ వాటర్ డీడీ దుర్గా ప్రసాద్, విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి ఆర్డీవోలు దాట్ల కీర్తి, బత్తుల వెంకట సత్యవాణి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారాది వంతెనకు శంకుస్థాపన



వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి/బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలం పారాది గ్రామం దగ్గర వేగావతి నదిపై గల పురాతనమైన వంతెన ప్రమాదకరమైన స్థితికి చేరుకుంది. దీని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే బేబీనాయన శంకుస్థాపన చేశారు. పాత వంతెన శిథిలమవడంతో రూ.కోటితో తాత్కాలిక కాజ్‌వేను ఏర్పాటు చేశారు. అది ఐదారుసార్లు వరదలకు కొట్టుకుపోయింది. ఇలా కొట్టుకుపోయిన ప్రతిసారీ వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు కొత్త బ్రిడ్జి పనులు ప్రారంభం కావడంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ 'పారాది వంతెనకు గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం పనులు చేయించలేక చతికిలపడింది. బిల్లులు అందవన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. గత ఏడాది వైసీపీ నాయకులు, అధికారులు రూ.మూడు లక్షలతో మరమ్మతులు చేసి రూ.30 లక్షలు డ్రా చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ అధికారం చేపట్టిన నేపథ్యంలో ఈ తరహా ప్రాజెక్టు పనులన్నీ పరుగులు తీస్తాయి. పారాది వంతెన పనులకు ఎమ్మెల్యే బేబీనాయన చేత గప్‌చుప్‌గా అధికారులు శుక్రవారం శంకుస్థాపన చేయించారు. మీడియాకు తెలియపరచకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రాథమ్యాల ప్రకారం సేవలు



ఆర్డీఓకు అభినందనలు తెలుపుతున్న డీఈఈ తదితరులు

బొబ్బిలి: ప్రభుత్వ ప్రాధాన్యాల మేరకు డివిజన్ పరిధిలో రెవన్యూ సేవలను అందజేస్తామని ఆర్డీఓ వీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి కసరత్తు చేస్తున్నామన్నారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల అధికారుల నుంచి సమాచారాన్ని తెప్పించుకొని అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. భూముల రీసర్వే ప్రక్రియలో అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, రికార్డుల్లో వారి భూములు తారుమారయ్యాయని ఆయన దృష్టికి తీసుకురాగా పొరపాట్లు, తప్పిదాలు జరిగితే వెంటనే సరిచేస్తామన్నారు. ఆర్డీఓ కార్యాలయానికి సొంత భవనానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. ఏఓతో పాటు ఇతర పోస్టు ల భర్తీకి కలెక్టరు ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఇదిలా ఉండగా డివిజన్‌లోని తహశీల్దార్లు, డీటీలు శుక్రవారం ఆర్డీఓను కలిశారు. ఎమ్మెల్యే బేబీనాయనను ఆర్డీఓ మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కలను అందించారు.

కోట చుట్టూ లాహిరి.. లాహిరి..!



కాలువ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పుడిప్పుడే వడివడిగా అడుగులు పడుతున్నాయి. చారిత్రక కట్టడాలకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వాటి ప్రాముఖ్యతను తెలియజేసేలా..పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ఇందులో భాగంగా కోట చుట్టూ బోటు షికారుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కోట చుట్టూ ఉండే చిన్నపాటి కాలువల్లో నీరు నిల్వ ఉండేలా చేసి అందులో పెడల్‌తో తొక్కే పడవలు, లేదా చిన్నపాటి తెడ్డులతో ప్రయాణించే పడవలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే కోట చుట్టూ ఆక్రమణలు తొలగించి, పువ్వులు, పచ్చటి పచ్చి, ఆయుర్వేద మొక్కలను నాటేందుకు అధికారులతో చర్చించారు. దీంతో పాటు జిల్లాలోని తాటిపూడి, చింతపల్లి, రామతీర్థం, పుణ్యగిరి తదితర పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ప్రకృతి వ్యవసాయం అత్యవసరం

బొబ్బిలి: వ్యవస్థకు పూర్తి స్థాయి సాయం చేసేది వ్యవసాయమేనని ప్రభాకర్ స్వామీజీ అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శక్రవారం స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి వేల సంఖ్యలో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేసి రక్షించేందుకు స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. గోమాతల కోసం సంరక్షణా కేంద్రం ఏర్పాటు చేసేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పది రోజుల పాటు హైదరాబాద్‌లో సుభాస్ పాలేకర్ నేతృత్వంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని అన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగులో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకులు విజయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలి



రాస్తారోకోలో పాల్గొన్న సీపీఎం నాయకులు

దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకను తక్షణమే అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శంకరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కోట వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. 100 రోజులు గడిచినా కనీసం కొందామన్నా ఇసుక దొరకటం లేదని అన్నారు. తక్షణమే ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ, డి.రమణ, త్రినాథ్, శ్రీను, రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టంపాడు రహదారికి నిధులు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

శృంగవరపుకోట రూరల్: గిరిశిఖర గ్రామమైన మూలబొడ్డవర పంచాయితీ చిట్టంపాడు గ్రామానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కృషితో కేంద్ర ప్రభుత్వం రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. దీనిపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం బొడ్డవరలో ఏర్పాటుచేసిన గ్రామసభలో టీడీపీ నాయకుడు ఇందుకూరి శ్రీనువాసరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే లలిత కుమారికి గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సభలో ఉపసర్పంచ్ ఆడారి అప్పారావు, కార్యదర్శి బంగారునాయుడు, గ్రామపెద్ద దేవాపురపు సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ



పోలీసు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పోలీసు వెల్ఫేర్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

హెచ్‌సీ కుటుంబానికి చేయూత

జిల్లా పోలీసు శాఖలో పనిచేసి ఇటీవల మరణించిన హెచ్‌సీ కుటుంబం కోసం పోలీసు సిబ్బంది సేకరించిన మొత్తాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం అందజేశారు. హెచ్‌సీ నారాయణరావు అనారోగ్య కారణాలతో మరణించగా... రూ.1.49లక్షల చెక్కును ఎస్పీ ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్పించిన టీడీపీ నాయకులు



వంతెనకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

జామి: భీమసింగి ఫ్లైఓవర్ ప్రమాదకరంగా మారిందని... దీనిపై ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. దీన్ని ఏ అధికారీ పట్టించుకోలేదు. దీంతో మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామినాయుడు, కార్యదర్శి దనియాల పైడిరాజు తదితరులు స్పందించారు. తమ సొంత నిధులతో శుక్రవారం వంతెనపై గోతులను పూడ్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎస్ఐ వీరజనార్దన్ బందోబస్తు నిర్వహించారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

రాజాం రూరల్: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి గడ్డిమందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఒమ్మి గ్రామానికి చెందిన చోడవరపు తిరుపతిరావు(45) గురువారం కడుపునొప్పిగా ఉండడంతో కూలిపనులకు వెళ్లకుండా ఇంట్లో ఉండిపోయాడు. ఇదే సమయంలో మద్యం తాగడానికి డబ్బులు కావాలని భార్య మంగను అడిగాడు. తన వద్ద డబ్బుల్లేవని ఆమె చెప్పడంతో కోపంతో పొలానికి వెళ్లి గడ్డిమందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చాడు. తిరుపతిరావు పరిస్థితిని గమనించిన భార్య మంగమ్మ, కుమారుడు అశోక్.. రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గురువారం సాయంత్రం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే శుక్రవారం మృతిచెందాడు. రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ జనార్దనరావు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

గంట్యాడ: బుడనతాపల్లికి చెందిన జాగ నాగమ్మ (62)అనే వృద్ధురాలు స్థానికం ఉన్న చెరువులో పడి మృతిచెందింది. దీని సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగమ్మ గత కొద్ది నెలలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం స్థానికంగా ఉన్న చెరువులో నాగమ్మ మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య



సూర్యనారాయణ రాజు (ఫైల్)

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలో గల ఒక ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొండపల్లి గ్రామానికి చెందిన తిరుమలరాజు సూర్యనారాయణ రాజు(51) విజయనగరంలోని ప్రదీప్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గత కొద్ది నెలలుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పాటు మానసిక వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో స్కూల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ సిబ్బంది విషయాన్ని గమనించి పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రూపా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

జియ్యమ్మవలస: మండలంలో 2019లో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితునికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.అరుణ తీర్పునిచ్చారు. ఎస్పీ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం పెదమేరంగి గ్రామానికి చెందిన పల్లా దుర్గారావును అదే గ్రామానికి చెందిన బంటు లోకనాథం అలియాస్ నాని పాతకక్షల కారణంగా గాయపర్చాడని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చినమేరంగి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. దీనిని అప్పటి ఎల్విన్‌పేట సీఐ డీవీజే రమేష్ కుమార్ దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో అతనికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి ఎస్.అరుణ శుక్రవారం తీర్పు వెలువరించారని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ కేసులో స్పెషల్ పీపీ గొర్లె వెంకటరమణ వాదనలు వినిపించారు. దర్యాప్తు అధికారి డీవీజే రమేష్ కుమార్, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

నిందితుడికి పదేళ్ల జైలు

నెల్లిమర్ల: బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడైన నెల్లిమర్ల మండలం ఏటీ అగ్రహారం గ్రామానికి చెందిన నారు అప్పలనాయుడుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయాధికారి కె.నాగమణి తీర్పు చెప్పారని ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారు అప్పలనాయుడు బొండపల్లి మండలానికి చెందిన ఓ యువతికి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను శారీరకంగా లోబర్చుకుని.. తర్వాత వివాహానికి నిరాకరించడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు అప్పలనాయుడును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో ఆయనకు పది సంవత్సరాల జైలు శిక్ష, 9వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పినట్లు ఎస్పీ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి రూరల్: పారాది గ్రామం వద్ద వేగావతి నది నుంచి శుక్రవారం అనుమతులు లేకుండా నలుగురు వ్యక్తులు ఇసుకను అక్రమంగా బొబ్బిలి వైపు తరలించారు. ఈమేరకు ఏఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది గొర్లి సీతారంపురం వద్ద 4 ట్రాకర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు రాంబార్కి వెంకటి, చిన్ని గౌరునాయుడు, బెల్లాన మురళి, నక్కేన ప్రసాదులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేశామని సీఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

సంతకవిటి: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. జావాం గ్రామం సమీపంలోని నాగావళి నది నుంచి ఇసుకను తరలిస్తుండగా తనిఖీ చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకుని సంతకవిటి పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు చెప్పారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వంగర: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.షేక్ శంకర్ తెలిపారు. తలగాం నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దాడులు చేసినట్లు తెలిపారు. పత్రాలు లేకపోటంతో లారీ సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో హెచ్‌సీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బాలభాస్కరశర్మ (ఫైల్)

గరుగుబిల్లి: తోటపల్లి సమీపంలో గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వాహనదారుడు మృతి చెందాడు. గరుగుబిల్లి ఎస్ఐ పి.రమేష్‌నాయుడు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఖడ్గవలస సముదాయం నుంచి చినమేరంగి వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న జియ్యమ్మవలస మండలం తుంబలి దత్తివలసకు చెందిన ఎం.బాలభాస్కర శర్మ (58)ను ఎదురుగా కారులో వస్తున్న డ్రైవర్ మెహర్ ఢీకొట్టాడు. బాలభాస్కరశర్మను 108 వాహనంలో పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు...

రణస్థలం: జాతీయ రహదారిపై పైడిభీమవరం అమ్మవారి ఆలయం సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూసపాటిరేగ గ్రామానికి చెందిన మురళీ రాజు (38) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పైడిభీమవరం లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న మరళీరాజు విధులు ముగించుకుని ద్విచక్ర వాహ నంపై స్వగ్రామం విజయనగరం జిల్లా పూసపాటిరేగ వస్తుండగా.. అమ్మవారి గుడి సమీపాన కుక్క అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయాడు. ఈ ఘటనలో ము రళీరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మింపేటను సందర్శించిన డీఎస్పీ

వంగర: మండలంలోని లక్ష్మింపేట గ్రామాన్ని శుక్రవారం చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు సందర్శించారు. గ్రామంలో పోలీసు పికెట్, శాంతిభద్రతల తీరును పరిశీలించారు. బాధితులను పరామర్శించి... సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ ఉపేంద్ర, ఎస్ఐ షేక్ శంకర్ ఉన్నారు.